# పేద నిజం కథ

తెనాలి రామకృష్ణుడు గావును అంటాడు "నిదురవంటిదిం రాతివంటిదియు గాదు" అని. అతనెప్పుడన్నాడో, ఏ సందర్భాన అన్నాడో నాకు గుర్తులేదు. ఆ రోజు సాయంకాలం మా ఇంటి తలుపు చప్పుడయినప్పుడు, సరిగ్గా నా పరిస్థితి అలానే ఉంది. మెలకువలో లేనిమాట నిజమేగానీ నిద్రకూడా పోవడం లేదు. చుట్టూతా ఏదో జరుగుతున్నదని తెలుస్తూనే ఉంది. ఏం జరుగుతున్నదంటే చెప్పలేను

"ఎవరో వచ్చారు" అన్నాడు నానీ మెల్లగా.

"ఎవరంటా... పేరడక్క పోయావా?" అన్నాను నేనూ మెల్లిగానే.

"అడగలేదు నాన్నా! ఎవరో తెలీదు ఎప్పుడూ చూసినట్టు కూడా లేదు" అన్నాడు వాడు.

సాధారణంగా మా ఇంటికి ముక్కు ముఖం ఎరగనివారెవరూ రారు. నాకు తెలిసినవారందరూ మా ఇంటిల్లిపాదికీ తెలీకపోవచ్చు గానీ, చాలామంది పేర్లు మా వాళ్ళకు గుర్తే! మనిషిని చూసినా చూడకపోయినా పేరు చెప్పినప్పుడన్నా గుర్తు పడతారు.

తీరా బయటికొచ్చి చూద్దునుగదా, అతనెవరో నాకూ కాస్త కొత్తగానే కనిపించాడు. అతన్నెక్కడన్నా, ఎప్పుడన్నా చూశానా? చెప్పలేను. పోనీ అలాంటి మనిషిని గురించి విని ఉంటానా? అదీ అనుమానమే! కానీ అతన్ని చూస్తుంటే చిన్నప్పు

ఎప్పుడో కాస్తంత ఎరిగినట్లు, తరువాత, గుర్తులోంచి కూడా చెరిగి పోయినట్లు అనిపించింది!

నన్ను చూస్తూనే అతను బలహీనంగా నవ్వి, అంతకన్నా బలహీనంగా నమస్కారం చేసి, లేచి నిలబడడానికి ప్రయత్నించి, అందుకూ్కడా వోపిక లేక కుర్చీలో జారగిలబడ్డాడు.

"మన్నించాలి. మిమ్మల్ని నేను గుర్తు పట్టలేకపోతున్నాన."

భగవంతుడి సాక్షిగా చెబుతున్నా. ఇదేదో మర్యాదకోసం అన్నమాటకాదు. అతన్ని నిజంగా నే గుర్తుపట్ట లేకపోయాను.

"ఫర్వాలేదు లెండి" అన్నాడతను సర్దుకూ్కచుంటూ "నేను వేళకానివేళ వచ్చినట్లుంది అయినా మిమ్మల్ని విసిగించను. మూడు ముక్కల్లో నే వచ్చిన పని చెబుతా..."

"నాకూ తొందరపను లేమీలేవు. మీకవతల మరీ ముఖ్యమైన పనులుంటేతప్ప ఇంకాస్తసేపు కూచున్నా నా కభ్యంతరం లేదు" అన్నాను 'కాస్త' అన్న దగ్గర కొంచెం నొక్కుతూ.

"నాగురించి మొదట్నించీ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు గానీ నేనంటే ఒకప్పుడు కాస్త భయమూ, కాస్త గౌరవమూ ఉండేది. ఈమధ్య అదీలేదు. అన్నిట్లో కల్తీ జరిగినట్లుగా నా విషయం లోనూ జరిగింది. అందులోనూ నాకు జరిగినంత అన్యాయం ఇంకెవరికీ, ఎప్పుడూ జరిగిఉండదు. ఆ సంగతే మీతో చెబుదామని వచ్చాను" అన్నాడతను.

"చెప్పండి!" అన్నాను వినడానికి సిద్ధపడుతూ.

"చెప్పేశానే" అన్నాడతను కొంచెం ఆశ్చర్యపోయి. "నేను అంత దూరంనించి పనిమాలా వచ్చింది ఈ సంగతి చెప్పడానికే!"

ఈ సారి ఆశ్చర్యపడడం నా వంతయింది. అతను ఎంతదూరం నుంచి వచ్చాడో, వచ్చి నాతో ఏంచెప్పాడో చచ్చినా అర్థంకాలేదు. ఆ ముక్కే వారితో అన్నాను.

"నా పేరు నిజం!" అన్నాడు. అని ఆలోచించుకోవడానికీ, ఆశ్చర్యపోవడానికీ, ఆశ్చర్యంనుండి తేరుకోవడానికి నాకో నిమిషం టైమిచ్చాడు ఇచ్చాక "ఇక చెప్పండి. విషయం బోధపడిందనుకుంటాను. నా గురించి మీరు కాస్త పట్టించుకోండి. పట్టించుకొని నలుగరికీ చెప్పండి నేనుండడం అంతో ఇంతో అందరికీ ఇరకాటంగా ఉంటుందని నాకు తెలుసు. అలాగని నన్ను పూర్తిగా పోగొట్టుకోడం కూడా మంచిదికాదు. కాదని అనుభవం మీకు చెబుతూనే ఉంది అయినా, అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోడ్డానికి మీరు సిద్ధపడడంలేదు. ఏదో విధంగా నన్ను మరుగుపరచడానికీ, పక్కకు తోసెయ్యడానికీ మీరు చూస్తున్నారు. చాలా సందర్భాల్లో నన్ను పూర్తిగా చంపి పారేస్తున్నారు. నాకు బదులుగా నకిలీ సరుకును చూపించి, 'ఇదే అసలైన నిజ'మని చెల్లుబాటు చేసుకొంటున్నారు. మీ చరిత్రలో, మీ సంస్కృతిలో, మీ రాజకీయాల్లో, మీ నిత్య జీవితంలో నాకు చోటు లేకుండా జాగ్రత్తపడుతున్నారు. అయినా నేను మొండి ప్రాణిని గనక ఎల్లాగో కొనప్రాణాలతో నెట్టుకొస్తున్నాను నన్ను దూరం చేసుకొంటున్నందుకూ, పోగొట్టుకొంటున్నందుకూ మీరు సిగ్గుపడాలి; భోరుమని ఏడవాలి. అందుకు బదులుగా నేను కనుమరుగయిన ప్రతిసారీ, నన్ను పాతాళానికి తొక్కేసిన ప్రతిసారీ. మీరు ఆనందిస్తున్నారు. ఏదో ఘన విజయం సాధించినట్టు పొంగిపోతున్నారు. ఇలా చేయడానికి మీరెందుకు సిగ్గుపడడంలేదో నాకర్థం కాక చాలా కాలమయింది. ఒక మంచి పని చేయడానికి సమయమంటూ లేదు జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుణ్ణించయినా నాగురించి ఆలోచించండి. నా అవసరాన్ని

గుర్తించండి! నాలుగు మంచి ముక్కలు రాసి నన్ను బతికించండి. ప్రచారం చేయండి. ఇలా అడగటం కోసమే నీ దగ్గరకొచ్చాను" అన్నారు నిజంగారు.

మంచు విడిపోయినట్టూ, మిసగ విడబారినట్టూ అనిపించింది. ఎలాంటి దాపరికమూ, అరమరికలూ లేకుండా ఆ పెద్దమనిషి అంత నిర్మొహమాటంగా అడిగినప్పుడు నేను మాత్రం నీళ్ళు నమలడం ఎందుకనిపించింది. అనిపించాక నేనన వలసిన నాలుగు ముక్కలూ గట్టిగానే అనేశాను.

"బాబుగారూ! మీరు చాలామంచి పని చేశారు. మీ గురించి రాయవలసిన మాట నిజమేగానీ— మీరెక్కడున్నారని రాయమంటారు? ఎలా ఉన్నారని రాయమంటారు ? అసలు నిజం వేరు-పైకి తేలివచ్చే నిజం వేరు. దాన్నించి నేను తెలుసుకొన్న నిజం వేరు. నేనైనా భరించగలిగినంత నిజాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తానే తప్ప. అంతకు మించిన లోతుల్లోకి పోను. ఆ లోతుల్లో, అడుగు పొరల్లో దాగొన్న నిజాలను తెలుసుకొని, నాకున్న ఈ కొద్దిపాటి మనశ్శాంతిని పోగొట్టుకోవడానికి సిద్ధంగా లేను" అన్నాను.

అతను తల దించుకొన్నాడు. కాస్సేపుండి ఉత్తరీయంతో కళ్ళొత్తుకొన్నాడు. అయినా, ఆ కళ్ళల్లో నీరు ఉబుకుతూనే ఉంది!

"బాబుగారూ! మిమ్మల్ని నొప్పించాలని నా ఉద్దేశం కాదు. నేనైనా ఇంతకన్నా మృదువుగా చెప్పి ఉండాల్సింది. క్షమించండి. 'ఓ అలాగే-తప్పకుండా!' అని మిమ్మల్ని సంతృప్తి పరచి ఇక్కడ్నించి సాగనంపడం నాకు చాతగాని పని ఎంత మాత్రం కాదు. రోజూ ఎంత మందితో అల్లాగా అంటూ బతుకొస్తున్నాను గాదు? ఉన్న సాధక బాధకాలను చెప్పానే తప్ప-నేనయినా మరీ అంతకూలికి

విషంతాగేవాణ్ని కాదు. కాదని మీరిపాటికే తెలుసుకొని ఉంటారే" అన్నాను ఆయనను ఓదారుస్తున్న ధోరణిలో.

నేను మెత్తబడుతున్నానని గ్రహించాడనుకొంటాను. తనను గురించి ఇంకో చిన్నసైజు ఉపన్యాసం దంచిపారేశాడు. అతను అవుననడమూ, నేను కాదనడమూ పద్ధతిలో ఈ మాట కచేరీని ఎంత సేపయినా సాగించవచ్చు. వీసమంత ఉపయోగం లేని ఇటువంటి చచ్చుపుచ్చు విషయాలమీద ఎంతసేపు వాగినా చివరకు తేలిచచ్చే దేమీ ఉండదు. ఉండదని నాకు తెలుసు. అతగానికే తెలీదు. తెలియ చెబుదామన్నా తెలుసుకోవడానికి ఆయన సిద్ధంగా ఉన్నాడో లేడో అంతకన్నా తెలియదు. అయినా ప్రయత్నించి చూడడంలో తప్పు లే దనిపించింది. రోగి బతకడని డాక్టరుకు తెలుసు, తెలిసినా చివరి క్షణందాకా డాక్టరు తంటాలు పడుతూనే ఉంటాడు. అంచేత అతన్ని తెలివి తక్కువ వాడని మనం అనలేంగదా! అలాగే నన్నూ అనకండి. ఆ డాక్టరు చేసిన పనినే నే నిప్పుడు ప్రారంభించాను.

* * *

పల్లెటూళ్ళ మాటకేంగానీ పట్నాల్లోని వీధులను చూస్తూనే అందులో ఏ తరహా మనుషులుంటారో సులభంగా పోల్చుకోవచ్చు. కలవారి వీధులన్నీ ఊరికి రవంత కడగా ఉంటాయి. ఖరీదుగానూ ఉంటాయి. అక్కడి రోడ్లు ఖరీదైనవి. ఆ రోడ్లకు అటూఇటూ ఉండే ఇళ్ళు ఖరీదైనవి. ఆ రోడ్లమీద నడిచే కార్లు ఖరీదైనవి. అప్పుడప్పుడు సున్నితంగా, సుతారంగా నడిచే మనుషులు వేసుకొనే చెప్పులు ఖరీదైనవి. ఆ ఇళ్ళకున్న గేట్లూ, ఆ గేట్లకు అవతలుండే మొక్కలూ ఖరీదైనవి. ఆ గేట్ల దగ్గర కాపలాకాసే కుక్కలుకూడా ఖరీదైనవే! అక్కడ ఖరీదు తప్ప ఇంకేమీ కనబడదు, ఏమీ వినబడదు.

ఓ ఖరీదైన ఇంటిముందాగి, ఖరీదైనగేటు చప్పుడు కాకుండా తీసి, ఆ గేటు నానుకొని ఖరీదైన కుక్కలున్నాయామోనని చూసి

మెల్లిగా లోపలికి అడుగు పెట్టాడు గోపాలం. ఆ ఇంట్లో ఖరీదైన కుక్కలున్నమాట నిజమేగానీ, ఆ కుక్కల మెడల్లో ఖరీదైన గొలుసు లున్నమాట నిజమేగానీ, అ గొలుసులు మరీ ఖరీదైన శశిభూషణ రావుగారి చేతిలో ఉన్నాయి. ఆయనకు అల్లంత దూరంలో నలుగురు మోతుబరులు చేతులు కట్టుకొని నిలబడి ఉన్నారు.

"యస్" అన్నారు శశిభూషణరావు గారు.

గోపాలం నమస్కారం చేశాడు.

"ఏం ?" అన్నట్టు తలెగరేశారు శశిభూషణరావు గారు.

తనెందుకొచ్చిందీ చెప్పుకోడానికి గోపాలం కాస్త అభిమాన పడ్డాడు.

కొన్నికొన్ని నిజాలను మనం ఏకాంతంలో వొప్పుకొంటాం. అదే పదిమంది ముందూ అనమంటే అనం. ఇదే గోపాలం విషయం లోనూ జరిగింది. 'అయ్యగారు' వొంటరిగా ఉంటే తను వచ్చిన పనిని చెప్పుకోడానికి గోపాలాని కెలాంటి అభ్యంతరమూ లేదు. కానీ ఆయనగారు వొంటరిగా లేరు

ఓసారి గోపాలంకేసి పరకాయించిచూసి, చూస్తూనే అతనెందు కొచ్చిందీ పసిగట్టేశారు శశిభూషణరావు గారు. ఈ కుర్రనాకొడుక్కు ఓ చిన్న షాక్ ఇద్దామన్న సరదా వారికకలిగింది. కలిగిన మరు క్షణమే గోపాలాన్ని కళ్ళతోనే దగ్గరకు పిలిచి, మోతుబరులను దూరంగా వెళ్ళమని ఆ కళ్ళతోనే చెప్పి పంపించి "యస్"అన్నారు శశిభూషణరావు గారు.

గోపాలం కాస్త వొణికాడు. పొడారిపోయిన గొంతుకను ఉమ్మి మింగి స్వాధీనంలోకి తెచ్చుకొన్నాడు. తెచ్చుకొన్నా మాట పెగలనందుకు తననుతాను తిట్టుకొన్నాడు.

"ఇంతలా వొణికిపోయేవాడివి నువ్వెలా బతుకుతావోయ్ ? నువ్వేం చదువుతున్నావ్? ఏ కాలేజీలో? ఎక్కడుంటున్నావ్? ఇదే మొదటిసారనుకొంటాను...ఫీజుకోసం..."

శశిభూషణ రావుగారి ఎడం చెయ్యి గోపాలం భుజంమీద బరువుగా పడింది. కుడి చేతిలో ఖరీదైన గొలుసులున్నయ్. ఆ గొలుసుల చివర్లన ఖరీదైన కుక్కలున్నయ్. ఆ కుక్కలు శశిభూషణరావు గారినీ, గోపాలాన్నీ ఒకటి రెండుసార్లు తేరిపారజూసి, సంగతి తెలుసుకొని తోక లాడించినయ్! శశిభూషణరావుగారి కుక్కలకే కాదు ఆ స్థాయిగల వారిళ్ళల్లో ఉండే అన్ని కుక్కలకూ అపాటి గ్రహింపు ఉంటుంది. అలా ఉన్నవాటినిగానీ వాళ్ళయినా దగ్గరకు రానీరు.

"అవున్సార్! మానాన్న ఆ మధ్య చచ్చిపోయాడు సార్! మా ఊళ్ళో హరిజనులకూ-ఊరివాళ్ళకూ చెరువు భూముల గురించి చాలా సంవత్సరాలుగా తగాదాలున్నాయండీ! మా నాన్న హరిజనుల పక్షమండీ! వాళ్ళకోసం పని చేస్తున్నాడని ఊళ్ళో వాళ్ళందరూ కక్షగట్టి చంపేశారండీ! కానీ కాలుజారి కాలువలో పడ్డట్టుగా అవతలి పార్టీవారు కోర్టులో రుజువుచేసి కేసు గెలిచారండీ! ఇక ఆ ఊళ్ళో ఉండలేక..." అని ఆగిపోయాడు గోపాలం.

శశిభూషణరావు గారి ఎడం చెయ్యి గోపాలం భుజంమీద ఇంకాస్త గట్టిగా బిగుసుకుంది. ఆ కేసును వకాల్తా పుచ్చుకొని నడిపించింది వారే! పాతిక వేలు పుచ్చుకొని, నరసింహంగాడు తప్పతాగాడనీ, ఆ మైకంలో కాలుజారి కాలవలో పడ్డాడనీ, పడి చచ్చిపోయాడనీ కోర్టువారిని నమ్మించింది వారే!

భుజంమీదా, మెడపక్కనా, పొత్తి కడుపుమీదా స్పష్టంగా ఉన్న గొడ్డలి దెబ్బలుగానీ, గునపం పోట్లుగానీ పోలీసులకు కనబడ

లేదు. కోర్టులో ఆ నరుకుళ్ళ సంగతీ, పోట్ల సంగతీ అసలు రానే రాలేదు.

తను పుచ్చుకున్న పాతిక వేలూ ఊరిమీద చందాలు వేసుకొని ఇచ్చారుట కావచ్చు. అందులో ఏ ఐదు వేలో తగ్గించుకొని హరిజనులిస్తే తను వాళ్ళ తరఫునే వాదించేవాడు. కేసును గెలిపించేవాడు. ఊరివాళ్ళను మట్టి తినిపించేవాడు, కనీసం అరడజను మందికయినా ఉరిశిక్ష వేయించి ఉండేవాడు. తనైతే ఐదు వేలు త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడుగానీ, ఆ త్యాగాన్ని అందిపుచ్చుకోడానికి హరిజనులు సిద్ధపడలేకపోయారు.

ఇక విధిలేనిదశలో శశిభూషణరావుగారు అవతలి పార్టీ తరఫున వాదించవలసి వచ్చింది. వాదించి గెలిపించవలసి వచ్చింది.

''అవునవును... తెలుసు. నువ్వు అయితే నరసింహంగారి , ?'' అని ప్రశ్నార్థకంగా చూశారు శశిభూషణరావు గారు.

''పాపం! అవస్థపడకోయ్'' అన్నారు వారు.

చెవులురిక్కించాడు గోపాలం.

"నీ చదువయిందాకా... ఆఁ...వింటున్నావా? నెల నెలా వచ్చి..."

శశిభూషణరావుగారు వాక్యం పూర్తి చేయకుండానే ఖరీదైన మోతుబరుల దగ్గరకొచ్చారు. శ్రీవారి ఎడమ గుప్పిటలో గోపాలం గాడి భుజం గిలగిల్లాడి పోతున్నది. కావాలనే గోపాలం వెనక్కు గుంజాడు. ఆ పెద్ద మనుషులదాకా వెళ్ళకముందే తాను అయ్యగారి నించి ఓమాట తీసుకొని జారుకొందామని అతననుకొన్నాడు. అలా జారిపోకుండా వారి ముందుదాకా గుంజుకొద్దామని శశిభూషణరావు గారనుకొన్నారు. వారు ఏమనుకొన్నారో అదే జరిపించారు.

"మంచిదోయ్... నీ పేరేమిటన్నావ్? సరే! నెలా నెలా నాదాక రానక్కర్లా. గుమాస్తా నడుగు. కావలసింది పట్టుకెళ్లు. కష్ట పడి చదువుకో. ముఖమాట పడకు. దరిద్రం సిగ్గుపడవలసిందిగాదు. సిగ్గుపడితే పోయేదీకాదు చేప్పొద్దూ అదేదో నీబోటివాళ్ళకోసమని పరమేశ్వరుడు చేసిన ఏర్పాటులాగుంది నాకు. దేవుడిమీద నాకు నమ్మకం లేదు. ఉన్నా గుడికెళ్ళే టైం లేదు. కోర్టులో...అవునా? అటువంటి దోషాలన్నీ మేం కడుక్కోవడానికి మాకున్న మార్గం ఒక్కటే! అది నీలాంటి వాళ్ళకు ఇంత దానమివ్వడం. నాకు తెలుగు సరిగ్గా రాదు. దీన్ని దానమంటారో, సహాయమంటారో తెలీదు. ఏదయితే అదే! మంచిది వెళ్ళిరా!" అన్నారు శశిభూషణరావు గారు.

ఆయననుకొన్నదీ, ఆయనక్కావలసిందీ అయిపోయింది. తను రెండు చేతులా సంపాదిస్తున్న మాట నిజమేగానీ, ఆ సంపాదనంతా తనొక్కడే అనుభవించడం లేదనీ, అందులోంచి దానధర్మాలకు చాలా మొత్తాలు తాను ఖర్చుచేస్తూ ఉంటాడన్న సంగతి ఎదుటి వారికి నసాళం అంటేలాగా తెలియాలి. అలా తెలిస్తే తప్ప ఆయన అంతరాత్మ శాంతించదు.

"నేనేదో ఎడాపెడా సంపాదించేసుకొంటున్నానని మిగిలిన ప్లీడర్లంతా ఏడుస్తారు. మనలోమాట... ఆ సంగతీ నిజమే. నావల్ల కాదోయ్‌బాబూ అన్నా పార్టీలు నన్నొదలందే ఏం చెయ్యమంటారో చెప్పండి? మొన్న జనవరిలో కోనేరులో జరిగిందే నరసింహంగాడి మర్డర్...ఆ కేసును అందరూ వదిలేశారు. నేనే ఒప్పుకొన్నాను, గెలిచాను. ఇపుడొచ్చింది ఆ నరసింహంగాడి కొడుకే. కోర్టులో 'న్యాయం' 'న్యాయం'అని కేకవేశాడు. న్యాయం గెలవాలన్నాడు. ఈ నాకొడుకు వాక్శుద్ధి ఉన్నవాడనుకొంటా. న్యాయం గెలిచింది" అన్నారు శశిభూషణరావు గారు.

ఆయన నవ్వుతాడో లేదో చూసి, రావుగారు సన్నగా నవ్వాక, మోతుబరులుకూడా నవ్వారుగానీ సన్నగా, సుతారంగా మాత్రం కాదు.

నౌకరు కుర్చీలు తెచ్చిపడేశాడు.

శశిభూషణరావు గారు వాచీ చూసుకొన్నాడు. 5.45 అయింది. సరిగ్గా ఆ వేళకు వారు కూచుంటారు. ఆ కూచునే వేళకు కుర్చీసిద్ధంగా ఉండాల్సి వుంటుంది.

"ఛలో" అంటూ వారు గొలుసుల్ని వదిలేశారు. ఖరీదయిన కుక్కలు ఖరీదైన ఇంగ్లీషు ముక్కల మాటుకు వెళ్ళిపోయాయి.

"ఇహ చెప్పండి!" అన్నారు శశిభూషణరావు గారు. "డాక్టర్ దగ్గర రోగం దాచకూడదు. ప్లీడరు దగ్గర కేసు దాచకూడదు. జరిగిందేమిటో చెప్పండి"

"వీడి పేరు కాంతారావండి! నాకు మేనల్లుడు" అన్నాడు బసవయ్య.

ఆ కాంతారావు ఒక కమిటీస్కూలుకు సెక్రటరీ. ఆ స్కూల్లో పర్మనెంటుగా ఉపాధ్యాయు లుండరు. ఏ సంవత్సరాని కా సంవత్సరమే సెలెక్ట్ చేస్తారు. ఇందువల్ల రెండు మూడు లాభా లున్నాయి. వరసాగ్గా ఉద్యోగాల్లో ఉంచితే పర్మనెంట్ చేయవలసి వస్తుంది. తొమ్మిదిమాసాలు చదువు చెప్పినందుగ్గాను, పన్నెండు మాసాలు జీతమివ్వాలి. ప్రతి సంవత్సరమూ ఉద్యోగాలకోసం కొత్త కొత్త వాళ్ళొస్తూ ఉంటారు మగవాళ్ళనించీ, ఆడవాళ్ళ నించీ ఏది వీలయితే అదే పుచ్చుకోవచ్చు. అలా కాకుండా పెర్మనెంట్ చేశారనుకోండి. 'ఏది వీలయితే అది' పుచ్చుకోడానికి ఛస్తే వీలుపడదు.

ఇవన్నీ కాంతారావుగారు ఆలోచించారు. ఆలోచించాకనే 'పెర్మనెన్సీ' అన్నదాన్ని ఎత్తి అవతల పారేశారు.

"మన బతుకులకే పెర్మనెన్సీ లేదుగదా! మనంచేసే బోడి ఉద్యోగాలకు పెర్మనెన్సీ ఏమిటండీ నాన్సెన్స్" అంటారాయన.

అనడమే కాదు— తను అన్న దానికి ఆయన కట్టుబడి ఉన్నాడు.

ఈ మధ్య కొత్తగా ఉపాధ్యాయుల్ని సెలక్షన్ చేయవలసి వచ్చింది. కాంతారావు చేస్తున్నాడు. అలా చేస్తూ చేస్తూ ఉన్నప్పుడు ఆడ సంతకంతో ఓ దరఖాస్తు కనబడింది. ఆ దరఖాస్తు దారును పిలిపించాడు. ఆవిణ్ని చూస్తూనే 'గజ్జల గుర్రం' అనుకొన్నాడు కాంతారావు అనుకొని "నీకి ఉద్యోగం రావడం కష్టమేనే!" అన్నాడు పైకి.

ఆ అమ్మాయి...అమ్మాయేం కర్మం 20-22 ఏళ్ళదాకా ఉంటాయ్... బిక్క చచ్చిపోయి కాంతారావు వేపు చూసింది. కన్నీటి తెరలు అడ్డం వచ్చినందువల్ల, అలానూ ఎక్కువసేపు చూడ లేకపోయింది.

"నువ్వు వెళ్ళబోకు. మిగతా మెంబర్లతో కూడా మాట్లాడి చూస్తా. నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తా. నచ్చ చెప్పగలననుకొంటా. అంచాకా ఆ గదిలో ఉండు" అన్నాడు కాంతారావు.

ఆ అమ్మాయి ఉన్నది. కాస్త కనుచీకటి పడ్డాక కాంతారావు వచ్చాడు. అతనితో బాటే పేగులు చుట్టుకుపోయే వాసన కూడా వచ్చింది. ఆ వాసనకు తట్టుకోలేక ఆ అమ్మాయ్ నిలువునా వణికి పోయింది ఆ వణుకును కాంతారావు తగ్గించాడు. తరువాత ఇద్దరు ముగ్గురు తగ్గించారు. ఆ తరువాత ఎంతమంది తగ్గించిందీ ఆ అమ్మా యికి తెలీదు. ఆ అమ్మాయి ఎప్పుడు చచ్చిపోయిందీ వీళ్ళకూ తెలీదు.

"అదన్నమాట కేసు" అన్నారు శశిభూషణరావు గారు.

"చిత్తం" అన్నాడు బసవయ్య.

శశిభూషణరావుగారు ఫకాలుమని నవ్వేశారు.

"నువ్వేదో సత్కాలక్షేపం చేసిరాక, ఆ గాంగునంతా ఎందుకు తీసుకెళ్ళావయ్యా! ఇలాంటి వ్యవహారాల్లో పార్టనర్ షిప్ పద్ధతి పనికిరాదు. లోకోపకారం చేద్దామని అసలే అనుకోకూడదు. నీకూ, నీ స్నేహితులకూ ఉరిశిక్ష పడుతుంది తెలుసా?" అన్నారు శశిభూషణ రావుగారు.

బసవయ్య గొల్లుమని వాపోయాడు.

"అందుకనే తమ దగ్గరకొచ్చానండి! పాతికవేలు పోయినా సరే ననుకొనే బయల్దేరానండి" అన్నాడు బసవయ్య - అయ్యగారి మనసులోవున్న అంకెను బయట పెట్టించడంకోసం.

"మూడోవంతో నాలుగోవంతో అడ్వాన్సు ఇచ్చిపోతున్నావుగానీ ఆ మిగతాది కూడా నాకు రెండు మూడు వారాల్లో కావాలి. అమ్మాయీ, అల్లుడూ అమెరికా వెడుతున్నారు. నీ కిష్టమయితే, నీవు భరించగలిగితే చూడు" అన్నారు శశిభూషణరావుగారు కుర్చీలోంచి లేస్తూ.

'ఓరి దొంగ నాకొడకా' అనుకొన్నాడు బసవయ్య. "చిత్తం! ఇష్టం అయ్యాక భరించక తప్పేదేముందిలెండి. ఇంద!" అని తోలు సంచి తెరిచాడు.

గుమాస్తా నోట్ల కట్టలు పంచెలో మూట గట్టుకొని వెళ్ళిపోయాడు.

"కాంతారావ్! ఇదెంతకాల మయిందయ్యా జరిగి?...పదో తేదీనగదా! నువ్వు 8వ తేదీ బుధవారంనాడు జబ్బున పడ్డావు. హఠాత్తుగా గుండెల్లో మంట, పొత్తికడుపు దగ్గర పోట్లు. డాక్టర్

జగన్నాధరావుగారి ఆసుపత్రిలో చేరావు. ఇప్పటికీ నువ్వక్కడే ఉన్నావు. నువ్వు కదలకూడదు, మెదలకూడదు. ప్రస్తుతం మందు లిచ్చి డాక్టర్ జగన్నాధరావుగారు నీకు నయంచేస్తున్నాడు. మందు కుర్కడా ఈ రోగం ఎదురు తిరిగితే అప్పుడు ఆపరేషన్ చేస్తారు. జగన్నాధరావుగారు మా అన్నయ్య. ఆయనకు నేను ఫోనుచేసి చెబుతాను. ఆయనగారి పద్ధతేదో ఉంది. ఆ ప్రకారం చెల్లించి అక్కడ జాయినయిపో. ఆ తేదీలూ అవీ జాగ్రత్తగా వేసుకోవాలి. ఆ పిల్ల చనిపోయినరోజుకు రెండు రోజులు ముందు నీకు జబ్బు చేసింది. నిన్ను తీసుకొని నీ కమిటీ మెంబర్లు జగన్నాధరావుగారి ఆసుపత్రిలో చేర్చారు. అప్పణ్నించీ నిన్నే కనిపెట్టుకొని ఇక్కడే ఉంటున్నారు. స్కూలు ఊరికి కాస్త దూరంగానే ఉంది గదా! స్కూలుకవతల గూడెం ఉందిగదా! ఆ గూడెం మనుషులో ఇంకె వరో నీ గజ్జెల గుర్రాన్ని చంపేశారు. లేదా ఎక్కడో చంపేసి, నీ ఎక్స్‌పార్టీవారు నిన్ను అగౌరవ పరుద్దామన్న అభిప్రాయంతో ఈ అభాండాన్ని నీ మీదకు తోశారు. వారి మీద నీవు పరువునష్టం దావా వేసి గెలవొచ్చు. దాని ఫీజు సంగతి తరవాత మాట్లాడు కొందాం. ఈ క్షణం నుంచీ నువ్వు బయట తిరగబోకు, గుమాస్తా నడుగు. నీలంరంగుకారు తీసుకో. అద్దాలు పూర్తిగా ఎత్తేసి ఆస్పత్రి కెళ్ళి పో" అన్నారు శశిభూషణరావుగారు కుర్చీలోంచి లేస్తూ.

అప్పటికి 7.30 అయింది. అది అయ్యగారు 'తీర్థం' సేవించే సమయం.

* * *

విమల, మోహన్ ఎక్కడ కలుసు కొన్నాడన్నది ముఖ్యం కాదు; ఎప్పుడు కలుసుకొన్నారన్నదే ముఖ్యం. ఆ వేళా విశేషం ఎటువంటిదోగానీ, వారిద్దరూ గాఢంగా ప్రేమించుకొన్నారు. ఆ ప్రేమలో మాలిన్యంలేదు. స్వార్థం అంతకన్నా లేదు.

కావడానికి మోహన్ కలవారబ్బాయి. అతగాడి తండ్రికి నాలుగు బియ్యం మరలూ, రెండు సినిమా థియేటర్లూ ఉన్నాయి. ఆపాటి ఆస్తిపాస్తులున్నవారు ఈ దేశంలో సవాలక్షమంది ఉన్నారు వాళ్ళందరకూ మోహన్‌లాంటి మంచి కొడుకులు ఉండరు. ఒకవేళ ఉన్నా నిర్మలంగా, నిష్కల్మషంగా ప్రేమించే హృదయం అసలే ఉండదు.

విమలమ్మ-రూపాయి లైబ్రరీలో చందాదారు. అక్కడుండే ప్రేమ సాహిత్యమంతా ఔపోసన పట్టేసింది. ఏ నవలను ఎవరు రాశారో, ఏ సీను ఎవరెవరు బాగా రాస్తారో, ఏ నవలలోని హీరో పేరు ఏమిటో, అతగాడు ఏ హీరోయిన్ను ఎన్నెన్ని వైనాలుగా 'లవ్' చేశాడో, అలాచేసి ఎన్నెన్నిసార్లు అమెరికా వెళ్ళొచ్చాడో విమల తల్లికి కొట్టినపిండి. ఆ నవలల్లోని హీరోలతో తన మోహన్‌ను పోల్చుకొని విమలా మేడం తనను తాను మరిచిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి.

మోహన్‌బాబుగారు విమ్మిని ప్రేమించాడనడంలో సందే హంలేదు వాళ్ళిద్దరూ పార్కులకూ, సినిమాలకూ వెళ్ళరనడం లోనూ సందేహం లేదు. అలా వెళ్ళినప్పుడల్లా విమల తల్లికి తాను చదివిన ప్రేమసాహిత్యంలోని హీరోలు జ్ఞాపకంవచ్చేవారు. ఇలాంటి సందర్భాలే ఆ నవలల్లో వచ్చినప్పుడు ఆ హీరోలు, హీరోయిన్లను ఎలా గుమ్మెత్తించేవారో విమల తల్లికి గుర్తుకొచ్చి-మోహన్‌బాబు గారు అలా చేయనందుకు విలవిలలాడిపోయేది. ఒకానొకదశలో విమలమ్మకు రాకూడని అనుమానం కూడా వచ్చింది- ఈ మోహన్ బాబుగారు ఉత్తి చూపుల గుర్రమేనేమోనని! తనింత రాసుకున్నా, పూసుకున్నా ఈ బుద్ధావతారం కదలనన్నా కదలడేమని ఆవిడ చాలాసార్లు అనుకొన్నది. మనిషి మరీ కట్టుదిట్టాల్లో పెరిగిఉంటా

డనీ, అడ్డమైన చాదస్తాలనూ అమ్మా నాన్న మప్పి ఉంటారనీ సరి పెట్టుకొంది.

డబ్బు చాలామందికుంటుంది. తెలివితేటలూ, సంస్కారమూ కొద్దిమందికే ఉంటాయి. 'మోహి' అయ్యకు డబ్బుంది. తెలివి లేదు. సంస్కారం అంతకన్నా లేదు. ఇవి రెండూ ఉన్నవారెవరూ తమ పిల్లలను దద్దమ్మలుగా తయారుచేయరు. వాళ్ళ పిల్లల్ని వాళ్ళకు కావలసినట్టుగా వాళ్ళు పెంచుతారు. మోహి విషయంలో అదే జరిగింది. ఇప్పుడు బుజ్జి మోహన్ తనవాడు. తన మనిషిని తన కావలసినట్టుగా తాను మలుచుకొంటుంది.

విమలతల్లి ఈ నిర్ణయానికొచ్చిన రెండో రోజునో, మూడో రోజునో ఇద్దరూ రెండో ఆట సినిమా కెళ్ళారు.

"ఈపూట నీ గది కొస్తున్నాను" అన్నది విమల.

"చాలాదూరం! మళ్ళా నిన్నింత దూరం వచ్చి దిగపెట్టాలి గదా!" అన్నాడు మోహి.

"అవసరంలేదు. నేనీరాత్రి నీ గదిలో నీతో ఉండిపోతాను... మరీ బ్రహ్మజమానంగా ఉండవాకు. పద!" అని తొందర చేసింది విమ్మి...

తాను పూర్తిగా పొరబడ్డానన్న సంగతి విమ్మికి ఇంకా స్త పొద్దుపోయాగ్గానీ తెలియలేదు. మోహన్‌బాబు ఆవిడనుకొన్నట్లు బ్రహ్మజమానం కానేకాదు. ఆ గదిలో అతగాడు చేసినట్లుగా ఏ ప్రేమ నవల్లోని హీరో కూడా హీరోయిన్ను చేసి ఉండలేదు. ఆనంద సాగరంలో ముంచి, తేల్చి, మళ్ళీ ముంచి, మళ్ళీ తేల్చి, ఇంకోసారి ముంచి, ఇంకోసారి తేల్చి, మరోసారి ముంచబోతున్న వేళకు విమలమ్మ జోగిలి పోయి ఉంది!

మన సంవత్సరానికీ, నెప్ట్యూన్ సంవత్సరానికి ఎక్కడా సంబంధం లేదు. అలాగే మన కాలమానానికీ, ప్రేమికుల కాలమానానిగ్గూడా ఎక్కడా సంబంధం ఉండదు! మనకు ఆరు మాసాలుగా తోచిన కాలం, ప్రేమించుకొన్నవారికి ఆరు గంటలుగానో, ఆరు పావుగంటలుగానో తోస్తుంది!

"మనం పెళ్ళి చేసుకుందామా?" అన్నది విమలమ్మ హఠాత్తుగా.

"తప్పకుండా చేసుకొందాం. చేసుకొన్నామనుకో - ఇంతకన్నా అప్పుడు మాత్రం నువ్వూ, నేనూ అదనంగా చేయవలసిందేమన్నా ఉందా? నాకు తెలిసినంత వరకూ ఉంటుందనుకోను. అయినప్పుడు అదేదో దిక్కుమాలిన పని కాలేదనుకోవడం ఎందుకో నాకు బోధ పడకుండా ఉంది" అన్నాడు మోహి.

"నిజమే ననుకో" అన్నది విమ్మి ఏదో ఆలోచిస్తూ.

"ఏయ్ దొంగా! నువ్వేదో దాస్తున్నావ్ గదూ? ఆ పప్పు లేవీ నా దగ్గర ఉడకవు. నన్ను నేనెప్పుడూ నీముందు దాచుకోలేదు. అలాగే నువ్వూ దాచుకోకూడదు" అన్నాడు మోహి - ఆమె బుగ్గ మీదకు సుతారంగా ఓ ముద్దును విసిరేస్తూ.

"ఈ పాత చింతకాయ వ్యవహారాలంటే నాకు వొళ్ళుమంట. మూడో రకం కథల్లోకి మల్లే మా అమ్మా నాన్నా నన్ను బలవంత పెడుతున్నారని కూడా నువ్వనుకోకు. వాళ్ళకీ సంగతి ఇంతవరకూ తెలీదు. భయపడి చెప్పకపోవడం కూడా కాదు. ఇది నా సొంత గొడవ. ఇందులో మరొకరు జోక్యం చేసుకోవడానికి నేనొప్పుకోను. ఎవణ్ని పెళ్ళాడితే సుఖపడతానో తేల్చుకోవల్సింది నేను గానీ మా అమ్మా నాన్నా కాదు. నేనా సంగతి తేల్చుకొన్నాను" అన్నది విమ్మి.

అదేదో నవల్లో హీరోయిను సరిగ్గా ఇలానే అంటుంది. అన్న తరవాత ఆవిడ హీరో కళ్ళల్లోకి చూస్తుంది. హీరో కూడా ఆవిడ కళ్ళల్లోకి చూస్తాడు. చూసి హీరోయిను కళ్ళను సుతారంగా ముద్దు పెట్టుకుంటాడు. గమ్మత్తేమిటంటే మోహీ కూడా సరిగ్గా ఇప్పుడా పనే చేశాడు.

ఇంగ్గీషులో ఆశ్చర్యపోయింది విమ్మి!

"ఓవేళ మీ అమ్మా నాన్నా నన్ను పెళ్ళాడేందుకు ఒప్పుకోకపోతే నువ్వేం చేస్తావ్ విమ్మీ?" అన్నాడు మోహీ.

''నీతో లేచిపోతాను. నో, నో...నిన్ను లేవదీసుకు పోతాను" అన్నది విమల, అతగాడి భుజాన్ని సుతారంగా కొరుకుతూ.

చిత్రం...

అసలైన మూడో రకం కథలో జరిగినట్లుగానే ఇక్కడా జరిగింది.

విమలమ్మ అమ్మగారూ, నాన్నగారూ, ఈ పెళ్ళికి వొప్పుకొన్నారు. అలా వొప్పుకొన్నందుకు విమల అంతో ఇంతో బాధపడింది. అమ్మా నాన్నా వొప్పుకోకుండా ఉండాలనీ, వారిని వొప్పించడానికి తాను వారితో వాదించాలనీ, అప్పుడూ వారు వొప్పుకోకుండా మొండికెత్తాలనీ, ఆ దశలో తాను కట్టుగుడ్డలతో మోహీ దగ్గరకు వెళ్ళిపోవాలనీ విమ్మి కలలుగన్నది. మోహిని లేవదీసుకుని సుదూర దూర దూర తీరాలకు వెళ్ళి అక్కడ రంగ రంగ రంగ రం... ఏదీ ఆ ముచ్చట తీరకనే పోయె!

మోహీ విషయం ఇందుక్కాస్త భిన్నంగా జరిగింది.

"నువ్వు చేసిన పని మంచిది కాదని నేను చస్తే అనను. నువ్వింకా పాతికేళ్లు వచ్చిందాకానన్నా ఆగావు. నేను నాపద్దెనిమిదో

ఏట నాకన్నా రెట్టింపు వయసున్నా విణ్ని ప్రేమించాను. నాకంత వరకూ ఆడదంటే ఏమిటో తెలీదు. తెలుసుకొన్నాను. పెళ్లి చేసుకోమని ఆవిడ అడగ లేదు. చేసుకొందామని నేనూ అనుకో లేదు. పాతికెకరాల పొలంతోబాటు మీ అమ్మను నాకిచ్చి పెళ్లి చేశాడు మీ తాత. నీ కిప్పుడు పాతిక లక్షలిచ్చి, పిల్లనిచ్చి పెళ్లి చేయడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు పాతికమందున్నారు" అన్నాడు మోహి నాన్నగారు.

ఆయన మరీ డబ్బు మనిషి!

"ఇప్పుడు మనకు లోటేముంది నాన్నా?" అన్నాడు మోహి, ముఖంలో ఎలాంటి భావమూ పలక్కుండా జాగ్రత్తపడుతూ.

"ముష్టివాడికి గుప్పెడు మెతుకులు తగ్గడం లోటు. జత ఎడ్లున్నవాడికి ఎనిమిదెకరాల పొలం ఉండడం లోటు. మనకు నాలుగు లకారాలకు బదులు మూడున్నర లకారాలే రావడం లోటు. బిర్లాగారికి నిరుటికన్నా పదికోట్లు తక్కువలాభం రావడం లోటు. బంగారం! 'లోటు', 'అదనం' అన్న ముక్కలున్నాయే-ఇవి మనిషిని బట్టి మారుతుంటాయి. మనం ఎంత గింజుకుచచ్చినా కలర్ ఫిలిం తియ్యలేము. మన కళ్ళముందే తీస్తున్నవారు నూటపాతిక మంది దాకా ఉన్నారు వాళ్ళముందు మనం లోటుగాళ్ళమా కాదా? నువ్వొప్పుకొంటే నీ కాబోయే మామగారి పేరు చెంచురామయ్య. ఆయనకు మద్రాసులో ఓ ఫిలిం స్టూడియో ఉంది. హైదరాబాదులో ఇంకో స్టూడియో కట్టబోతున్నాడు. కాకినాడలో ఫెర్టిలైజర్ ఫాక్టరీకావలసిన పెట్టుబడి సిద్ధం చేసుక్కూచున్నాడు." అన్నాడు నాన్నగారు.

మోహి కళ్ళు ఇంతచేసి చూశాడు.

"నువ్వో వారాలబ్బాయివయితే విమల నీ గదికొచ్చి ఉండేదేనా? నన్నడిగితే, నీ ముఖం కూడా చూసి ఉండదంటాను. నీకన్నా

సుందరపురుషులు లేకనే విమల నిన్ను ప్రేమించిందని అనుకోవాకు. నీ వెనక రూపాయలున్నాయి. పిచ్చిగా రూపాయల్ని పండించే వ్యాపారాలున్నాయి. విమల నీరూపాయల్ని లవ్ చేసింది. నీకన్నా రూపాయలున్నవారు ఈ దేశంలో చాలా మంది ఉన్నారు. నిజమే గానీ వారెవరూ ఆవిడకు అందుబాటులో ఉండి ఉండరు. చెంచు రామయ్యగారయినా - తన కూతుర్ని నీకిస్తాననడానికి కారణం, నీ చదువుకాదు, నీ సొగసూకాదు. నీ చుట్టూ పరుచుకున్న రూపాయలు. నీకన్నా పెద్ద సంబంధాలను ఆయన కొనలేడు. ఆయన కొనుగోలుశక్తి పరిధిలో నువ్వున్నావు. కొందా మనుకొన్నాడు. తను నీకు చెల్లించగలిగిన ధర చెప్పాడు. నీమీద వీలయినంత ఎక్కువ ధర రాబడదామని నేను తంటాలు పడుతున్నాను. నువ్వు కారు చవగ్గా అమ్ముడు పోతానంటే నాకేమి అభ్యంతరంలేదు. ఇంక... ప్రేమలూ, వంకాయలూ నాదగ్గర మాట్లాడకు. ఈ ఆస్తికి నిన్నా విమలమ్మ ప్రేమించింది. నీకే ఇంతకు రెట్టింపు ఆస్తి ఉన్నదనుకో. కాస్సేపు అలా అనుకో - పదిమంది విమలమ్మలు ప్రేమిస్తారు. అదేవత్తో హాలీవుడ్ తార ఓ ఆరబ్ నవాబుగాణ్ని పెళ్ళాడింది. వాడంత అందగాడు లేకనేనా? కానేకాదు. కాబట్టి నాయనా... ఇహ నీ ఇష్టం! నువ్వు విమలమ్మకు మొగుడివయినా నాకిష్టమే! చెంచురామయ్యకు అల్లుడివయినా నాకిష్టమే" అన్నాడు నాన్న.

మోహి గుట్టుచప్పుడు కాకుండా చెంచురామయ్యకు అల్లుడయిపోయాడు.

మూడోరకం కథల్లోమాదిరిగా విమ్మి భోరుమని ఏడవలేదు. ఏడవలేదుగానీ లోలోపల బాధపడింది. అదేదో నవల్లో హీరోగారు హీరోయినుకొక అగ్నిపరీక్ష నేర్పాటుచేశాడు. తనకు మశూచికం వచ్చిందనీ, ముఖమంతా మచ్చలు పడ్డాయనీ, చేతులు వంకర్లు తిరిగి పోయాయనీ, హీరోయిను నమ్మేలాగ చేశాడు. హీరోయిను

నమ్మింది. ఆవిడది నిర్మల ప్రేమ గనుక, ఆవిడ ప్రేమకు బాహ్య సౌందర్యం ముఖ్యం కాదుగనుక, అదే హీరోను పెళ్ళాడ్డానికి సిద్ధపడి అతనున్నవూరు వచ్చింది. మిస్టరీ విచ్చిపోయె...ఇద్దరూ అరగంటలో పెళ్ళాడేసి హానీమూన్ అమెరికాలో గడపడం కోసం వెళ్ళిపోతారు.

'అలా జరిగితే ఎంత బావుండును?' అనుకొన్నది విమలమ్మ.

ఎంతయినా బావుంటుందిగానీ అలా జరగలేదుమరి!

విమలమ్మ పెళ్ళి ఇంతకుముందు దాకా ఆవిడ సమస్య. ఇప్పటినించీ ఆవిడ నాన్నగారి సమస్య. ఈ సమస్యను ఆయన భారి ఎత్తున కాకుండా తన స్థాయిలో పరిష్కరించా లనుకొన్నాడు.

ఎక్కడో ఎవడో కుర్రాడున్నాడని విన్నాడు. వినికిడినిబట్టి ఆ కుర్రాణ్ని చూసిరావడమే కాకుండా, విమలను చూడ్డానికి రమ్మనికూడా చెప్పాడు.

"కుర్రాడు బియ్యే. ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం. నవమన్మథుడు కాడు... చూడండి. నవకాయ పిండివంటలతో భోజనం చేయాలని నాకూ ఉంది. తూగలేను. అందుకని పచ్చడి మెతుకులతో సంతృప్తిపడుతున్నాను. మార్కెట్లో మగనాయన్ల ధరలు మండి పోతున్నాయి. మనం కొనగలగాలిగదా!" అన్నాడాయన.

ఈ పరిభాషను విమలమ్మ భరించలేకపోయింది. "మరి అవేం మాటలు నాన్నా! కూరగాయలు కొనుక్కోలేం గదాని గొడ్డు కారంతో తిండి తినమనడం ఏం భావ్యం?" అన్నది రవంత రుసరుస లాడుతూ.

కూతురువేపు ఆశ్చర్యంగా చూశాడాయన.

"నువ్వు తిండిలోకి మంచికూరను గురించి ఆలోచిస్తున్నావు. అసలు ఒక్క మెతుగ్గూడా లేనివాళ్లు ఈ దేశంలో కోట్లమంది

ఉన్నారు. తడవకు ఐదేసి వందల రూపాయలుచేసే చీరలు కట్టుకోవాలని ఉండడం వేరు. కట్టుకోగల స్థోమత ఉండడం వేరు నీకిప్పుడు అర్థమై ఉండాలే!" అన్నాడాయన చిరాగ్గా.

విమల మాట్లాడ లేదు.

"నువ్వలా మూతి ముడుచుకొంటే లాభంలేదు. నువ్వయినా చిన్నదానివి కాదుగదా-ఓ లెంపకాయ ఇచ్చి చెప్పడానికి. మోహన్ సంగతి చివరిక్షణందాకా నాకు తెలీదు. ఆడవాళ్ళ శీలాన్ని గురించి నాకు పరమచాదస్తాలు లేవుగానీ, అవి ఉన్న వాళ్ళమధ్య మనం బతుకుతున్నాం. మనకిష్టమున్నా లేకపోయినా అందరూ ఆమోదించిన విలువల్నే మనమూ ఆమోదించాలి. ఈ విలువలకు ఎదురుతిరిగి పోరాడిన కారణజన్ములున్నారు. నేను కారణజన్ముణ్ని కాను మామూలువాణ్ని. కాకపోతే కాస్తంత సంస్కారం ఉన్నవాణ్ని. నా ఆర్థికస్థితి, నా సంస్కార హృదయాన్ని నొక్కి పారేసింది...." అన్నాడాయన.

విమలకేదో అర్థమయినట్లుగానే ఉంది. 'నువ్వేమర్థం చేసుకొన్నావో చెప్పు' మంటే మాత్రం నాలుక వెళ్ళబెడుతుందే తప్ప ఏమీ చెప్పలేదు.

ఆ కుర్రవా డొచ్చాడు.

కిటికీ తెరమీంచి అతణ్ని చూసింది విమల. ఆవిడలో ఏ ఉద్రేకమూ కలగలేదు.

"అమ్మాయిని చూడ్డంకోసమనే నేను రాలేదు. నన్ను మిగిలిన వారందరూ చూడ్డంకోసం వచ్చాను. నూరు అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యాలని గావును మనవారు చెబుతారు. నాకెందుకో అలాంటి మెలికలంటే ఇష్టంలేదు. అయితే గియితే అన్నీ కలిసొస్తే, నేను మీ అల్లుణ్నయితే అలా అయినందుకు ముందు ముందు నేనుగానీ, మీరు

గానీ పశ్చాత్తాప పడకూడదు. నా గురించి నేను చెప్పుకొన్నంత స్పష్టంగా ఇంకొకరెవరూ చెప్పలేరు. నా చదువు మీకు తెలుసు. నా సోయగం మీరు చూస్తూనే ఉన్నారు. నా జీతం పది తక్కువ తొమ్మి దొందలు. నేను పోషించవలసినవాళ్ళు నేనుగాక నలుగురున్నారు. అమ్మ నాన్న లేరులెండి. ఇద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ముడు...సొంత వూళ్ళో ఓ పాతకాలపు పెంకుటిల్లు ఉంది. పొలంలేదు. ఇళ్ళ స్థలం లేదు. ఐదు రూపాయలకు మించి నా బాంకులో ఎప్పుడూ బాలెన్స్ కూడా ఉండదు ఆగండి...ఇప్పుడిప్పుడే మీ అమ్మాయిగారిని నాకు చూపించకండి! నేనింకా ఈ ఊళ్ళో నాలుగయిదు రోజులదాకా వుంటాను. ఇక్కడి బ్రాంచి వ్యవహారాలు సజావుగా లేవులెండి. వాటినో దోవలో పెట్టాలి. అదీ సంగతి. మీరంతా ఆలోచించుకోండి. తొందర లేదు. అవసరమని తోస్తే నాకు కబురు చేయండి. వచ్చి అమ్మాయిగారిని చూస్తా. మీనించి కబురు రాలేదనుకోండి, బ్రాంచి పనులు చూసుకొంటా. అక్కడికొచ్చి 'అనంతం' అనడిగితే చెబుతారు. వస్తా, నమస్కారం!"

ఇది కళ్ళముందు జరిగింది కనక విమల నమ్మింది గానీ, ఎక్కడన్నా చదవడమే జరిగితే నిలువునా పగలగోసినా విమల నమ్మేది కాదు. ఆ పూటా, ఆ తరవాత రెండు రోజులూ కూడా విమల మనుషుల్ని తప్పించుకొనే తిరిగింది.

మూడోరోజు సాయంత్రం పెందరాడే పని ముగించుకుని, సినిమాకు వెడదామన్న ఉద్దేశంతో గదికి తాళంవేసి వెనక్కు తిరిగాడు అనంతం!

ఎవరో తలొంచుకుని మెట్లెక్కి వస్తున్నారు.

"ఎవరు కావాలమ్మా?" అన్నాడు అనంతం.

"మీరే!"

అనంతం అదిరిపోయాడు.

"మీకేమన్నా అర్జంటు పనిమీదగానీ వెడుతున్నారా?" అన్నది విమల.

"సినిమాకు పోదామనుకొన్నాను గానీ కుదరదులెండి... ఉండండి. తాళం తీస్తాను" అన్నాడు అనంతం, ఇందాక దిగిన రెండు మెట్లు మళ్ళీ ఎక్కుతూ.

"తాళం తీయకండి. మీ సినిమా ప్రోగ్రాం రేపటికి వాయిదా వేసుకోండి. కాస్సేపు పార్కులో కూచుందాం రండి"

"మీ..."అని నసిగాడు అనంతం.

"తొందర పడకపోతే అన్నీ చెబుతా!"

అనంతం తొందరపడ దలుచుకోలేదు. పార్కులో మూలగా అట్టే జనంలేని చోటు చూసుకొని కూచున్నారు.

"మీరు నాకు నచ్చారు. మా ఇంటిల్లిపాదికీ నచ్చారు" అన్నది విమల.

అనంతం ముఖం వికసించింది.

"ఆ సంగతి చెప్పడం కోసమనే వచ్చాను. మానాన్న మీకు కబురు చేస్తానన్నాడు. ఆగమని నేనే చెప్పాను" అన్నది విమల.

"కాకితో కబురు పంపినా వచ్చేవాణ్ని" అన్నాడు అనంతం.

"మీరు రారనికాదు - మీరక్కడకు వస్తారన్న భయంతోనే ఆగమన్నాను. ఎందుకంటే మీరు నాకు నచ్చినంత మాత్రాన మన పెళ్ళికాదు. నేనూ మీకు నచ్చాలిగదా! నా కర్మకాలిపోయి నేను మీకు నచ్చలేదనుకోండి, ఆ మాట మీరు ఫెడీమని అనేశారనుకోండి- మానాన్న, అమ్మ కూడా కుంగిపోతారు. వాళ్ళకా షాక్ లేకుండా చేయడం కోసమనే నేనిలా మీ దగ్గరకొచ్చాను" అన్నది విమల.

"నేనంత మూర్ఖంగా అనేవాణ్నికాదే" అన్నాడు అనంతం.

విమల సన్నగా నవ్వింది.

" 'మూర్ఖంగా' అని మీరంటున్నదాన్ని నిజానికి 'నిర్మొహమాటంగా' అని అనాలి. మీరు నిర్మొహమాటంగా కుండ బద్దలుకొట్టినట్టుగా చెబుతారు. మేమెవరమో మీరు తెలుసుకోకుండానే మీ గురించీ, మీ కుటుంబాన్ని గురించీ దాచుకోకుండా చెప్పారు. దీన్ని గురించీ అలాగే చెప్పేస్తారేమోనని నా భయం" అన్నది విమల.

"నేను మీకు నచ్చినందుకు థాంక్స్" అన్నాడు అనంతం.

అంతవరకూ బాగానేఉంది గానీ, మరి తన సంగతేమిటి?

విమల కాస్త కంగారు పడింది. అంతలోనే ఆ కంగారును కనపడకుండా దాచేసి అనంతంకేసి చూసి పలచగా నవ్వింది.

"నాకనే ఏమిటిలెండి - మరీ గొంతెమ్మ కోరికలు కోరుకొనే వారి సంగతి నాకు తెలీదుగానీ చాలామందికి - ఎక్కువమందికి కూడా నేమో - మీరు బాగానే నచ్చుతారు. . . నచ్చే ఉండాలి మరి! మరేం అనుకోకండి. ఈ పెళ్ళిచూపుల తతంగం మీకూ ఇదే మొదటిసారి కాదుగదా?" అన్నది విమల కాస్త జాగ్రత్తగా.

"కాదు... కాదులెండి! లోగడ రెండు మూడు సంబంధాలొచ్చాయి. ఒకరికి నా ఉద్యోగం నచ్చలేదు. ఇంకొకళ్ళకు నేనూ, ఉద్యోగమూ కూడా నచ్చినట్టేగానీ నాకుటుంబం నచ్చలేదు" అన్నాడు అనంతం.

"మూడో సంబంధంలో పిల్ల నచ్చలేదా?" అన్నది విమల నిరుద్రేకంగా.

"ఈ మూడు సందర్భాల్లోనూ నేను ఆడపిల్లల్ని చూడలేదు. చూడను కూడా. నాతో కాపరం చేయడం అవతలివారికి ఇష్టమో

కాదో ముందు తెలుసుకోంటే తప్ప నా ఉద్దేశాన్ని బయటపెట్టి లాభంలేదు''

"ఇన్నిటికీ మూడో సంబంధం సంగతి చెప్పనేలేదు''అని కొస అందించింది విమల.

''వాళ్ళు డబ్బున్నవాళ్ళు. ఎంత ఖరీదైనా చెల్లించగలవాళ్లు. వాళ్ళివ్వగల డబ్బుకు చాలా మంచి సంబంధాలొస్తాయని నాకు తెలుసు. ఎక్కువ ఖర్చుచేసి తక్కువరకం సరుకును కొనడం మంచిది కాదని, నేనే సలహా ఇచ్చాను. అయినా వారు వినలేదు. . . రెండు మూడు రోజులపాటు నన్ను గానుగాడేశారు. ఆ దెబ్బకు తట్టుకోలేక పదిరోజుల్లో వచ్చి పిల్లను చూస్తానని అప్పటికి తప్పించుకొన్నాను. తాత్కాలికంగా ఆ చెర విరగడయిందేగానీ, ఓ అనుమానం మాత్రం నన్ను పీడిస్తూనే ఉండింది. వారేమో బాగా ఉన్నవారుగదా, ఏ ధర చెల్లించడానికయినా సిద్ధపడుతున్నారుగదా.. అయినప్పుడు ఏ పెద్దింటి సంబంధమో చేయకుండా నాలాంటి చచ్చు సంబంధంకోసం ఎందుకిలా పాకులాడుతున్నారో తెలుసుకుందా మనుకున్నాను... తెలుసుకొన్నాను'' అన్నాడు అనంతం.

''ఏం తెలుసుకొన్నారని నేనడగడం సభ్యతగా ఉండదుగదూ?'' అన్నది విమల.

''బేషుగ్గా ఉంటుంది. మీరు తప్పకుండా అడగొచ్చు. నేను చెప్పడమే సభ్యతగా ఉండదు. మాటన్నాను గనక పదిరోజుల తరువాత ఆ ఊరెళ్ళాను. అక్కడా మా బ్రాంచి ఆఫీసుందిలెండి. వారింటి కెళ్ళాను...''

''మా ఇంట్లో చెప్పినవన్నీ వారికీ చెప్పారు'' అని మధ్యలో అందుకొంది విమల.

"చెప్పలేదు. ఎందుకంటే వారికి అంతకు ముందే నా సంగతు లన్నీ చెప్పేశాను. ఇక పిల్ల మాత్రం వినాలి. పిల్లకు నేను నచ్చాక ఆ సంగతులన్నీ ఇంకో విడత చెబుదా మనుకున్నాను. ఆ పిల్లకు నేను నచ్చనని నాకు ముందే తెలుసు" అన్నాడు అనంతం.

విమల తెచ్చిపెట్టుకొన్న నవ్వొకటి నవ్వింది. నవ్వి - అనవ సరంగా ఓసారి పైట సవరించుకుంటూ, "మీరు నచ్చకపోవడ మేమి టండి బాబూ...నిక్షేపానికి మల్లే ఉంటేనూ" అన్నది.

"ఇంతకన్నా మంచి నిక్షేపాన్ని ఆవిడ అంతకుముందే నచ్చేసు కొంది" అన్నాడు అనంతం హాయిగా నవ్వుతూ.

విమల కొయ్యబారి పోయింది. ఒక్కసారిగా లోపలినుంచి ఆవిరులు ఎగ చిమ్మినట్టయింది. తనను తాను సంబాళించుకోవడానికీ, తన అనుభూతుల్ని దాచుకోవడానికీ ఆవిడ గింజుకోవలసి వచ్చింది.

"ఇంకొకరి ప్రేమ వ్యవహారాల్లో దూరడం నా కిష్టం లేదు. ఆ అమ్మాయి ఇంకెవణ్నో చేసుకుంటానంటుంటే, వాడు పెద్ద వాళ్లకు నచ్చలేదు గనక - వాణ్నించి ఆ పిల్లను విడగొట్టి ఇంకోడి కిచ్చి చెయ్యడంలో ఉన్న నీతిని నే నర్థంచేసుకోలేను."

అప్పటికి బాగా చీకటిపడింది.

విమల సాహసించి అనంతం చెయ్యి పట్టుకుంది. ఆ చెయ్యి చల్లగా ఉంది. పైగా వణుకుతూ ఉంది!

"ఎలాచెప్పాలో తెలీడంలేదు...నాకు చెప్పడం చాతకావడం లేదు...నాకు ప్రేమ గురించి ఏమీ తెలీదు. కనీసం ఆ సాహిత్య మన్నా చదివినదాన్ని కాదు. మీ రావేళ మా యింటికొచ్చినప్పుడు కిటికీ తెర వెనకనుంచి చూశాను. మీ మాటలన్నీ విన్నాను. అప్పుడే వచ్చి నా ఉద్దేశం చెబుదా మనుకొన్నాను. అనుకొన్నాను గానీ

ఇందాకా మీతో చెప్పానే... ఆ అనుమానం మెసలాడి మానేశాను. ఈ మూడురోజులనించీ మీదగ్గరకొద్దామని మనస్సు ఎంతగా పీకిందో నాకూ, ఆ భగవంతునికీ తెలుసు''

ఈ దశలో అనంతం చెయ్యికూడా విమలచేతిని కాస్త గట్టిగా పట్టుకుంది!

''మీ దగ్గరకు నేనే వస్తే మీరింకోలాగా అనుకొంటారేమో నని భయం! అక్కడకు మిమ్మల్ని రప్పించే ప్రసక్తే లేదనుకోండి. ఏదయితే అదే అవుతుందని ఇలా తెగించి వచ్చేశాను...రాకూడదని తెలుసు. రాకుండా ఉండాలని నన్ను నేను మూడురోజులనించీ నిగ్ర హించు కొంటున్నాను. ఇక నాకీ నిగ్రహశక్తి కూడా తగ్గి పోతున్నదని తోచింది...తగ్గిపోయింది. పీదాగాపోయాక ఇలా మీ దగ్గరకొచ్చాను'' అన్నది విమల.

ఆసరికే అనంతం చేయి వెచ్చబడింది. అతని వేళ్ళు విమల వేళ్ళను సున్నితంగా నొక్కుతున్నాయి.

విమల సన్నగా వినపడీ పడనట్లుగా నిట్టూర్చింది.

''నేను...నిన్ను...పెళ్ళి...పెళ్ళాడను అనుకో...''అన్నాడు అనంతం గుటకలు మింగుతూ.

"మానేయండి. నేను మాత్రం మిమ్మల్నే చేసుకొంటాను. అదిగో - ఆ సంగతి చెబుదామనే వచ్చాను. లేవండి, వెడదాం'' అన్నది విమల, అతనికి బాగా దగ్గరగా జరిగి.

''లాభంలేదు. లేవలేను. నాకింకా ఇక్కడే కాసేపు కూచుం దామని ఉంది'' అన్నాడు అనంతం, ఆమె చెంపదాకా తన ముఖాన్ని తీసుకొస్తూ.

"ఇలాంటివన్నీ ఇక్కడగాదు. మీ గదిలో" అన్నది విమల అతని చేతిని మెల్లిగా నొక్కుతూ.

అనంతం ఒక్క ఊపుతో లేచి, లేస్తూనే విమలను గట్టిగా వాటేసుకొని, ఆ కావిలింత విడవకుండానే ఎడాపెడా ముద్దులు పెట్టేశాడు.

విమల కన్నుల్లో సన్నని నీటి జీరలు, ఆమె గుండెల్లోంచి అంతకన్నా సన్నని నిట్టూర్పులు...

* * *

పదిహేను సంవత్సరాల కిందటి మాట. చవటపాడులో సహకార సంఘం ఎన్నికలు ఫలానా తేదీన జరుగుతాయని రిజిస్ట్రారు ప్రకటించాడు. అప్పటిదాకా ఒకటిగా ఉన్న ఊరు కాస్తా ముక్క చెక్కలయింది. ఒక ముక్కకు రాజరాజేశ్వరరావుగారు నాయకుడు. రెండో చెక్కకు ఆంజనేయులు నాయకుడు.

రాజరాజేశ్వరరావుగారికి డబ్బుంది. పలుకుబడి ఉంది. డబ్బుతోనూ, పలుకుబడితోనూ సాధించలేనివేవీ లేవన్న నమ్మకం కూడా వారికుంది.

ఆంజనేయులుకు పలుకుబడి లేదు. డబ్బు లేదు. మంచితనం మాత్రం ఉంది. మంచితనంతో సాధించలేని వేవీలేవన్న గుడ్డినమ్మకం కూడా ఉంది.

ఆంజనేయుల ముఠాను పోటీనుండి తప్పుకోమని రాజరాజేశ్వరరావుగారు కబురు చేశారు.

"అతనికేం కావాలో అడగమనండి. మనం సర్దుబాటు చేద్దాం... నువ్వు ముందుగా తూలబోకు. అతనూ, అతని మనుషులూ రంగం నుండి తప్పుకొంటే ఒక లక్ష ఖర్చయినా

నా కభ్యంతరం లేదు. డబ్బు పాపిష్టిది. నువ్వు ముందుగానే 'లక్ష' అన్నావంటే, అతను రెండోదానికోసం ఆశపడవచ్చు. నువ్వు 50 వేలతో ప్రారంభించు. లక్షదాకా పో. అవసరమనుకొంటే, ఇంకో పాతికదాకా వెళ్ళినా నాకభ్యంతరం లేదు. ఇతరత్రా ఖర్చయ్యే డబ్బును అతనికి ముట్టజెప్పేందుకు నాకెలాంటి అభ్యంతరమూ లేదు'' అన్నారు రాజరాజేశ్వరరావుగారు మధ్యవర్తితో.

రాయబారం ఫలించలేదు.

ఎన్నికలు జరిగాయి. రాజరాజేశ్వరరావుగారు చాలా ఖర్చు చేశారు. చాలా ప్రచారం చేశారు. కులం వారిగా, మతం వారిగా ఓటర్లను చీలదీశారు. కొంతమంది సభ్యుల్ని దాచేశారు. అయినా అంజనేయులుగారి 'చెక్క'కే విజయం లభించింది. రాజరాజేశ్వర రావు గారికి చావుతప్పి కన్ను లొట్టబోయినంత పనయింది. ఆయన 9 ఓట్ల మెజారిటీతో గెలిచాడు. ఆయన 'ముక్క' పక్షాన నిలబడిన వారిలో ముగ్గురు మాత్రమే గెలిచారు. సహకార సంఘం అంజనే యులు గారి చేతికింది కొచ్చింది.

ఇలా జరగడం మంచిదే అయింది. ఆ తరవాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ రాజరాజేశ్వరరావుగారు శాసన సభకు ఎన్నికయ్యారు. మంత్రిమండలి ఏర్పాటు కావడానికి ముందు ఆయన కూడా మంత్రి కావచ్చునని పత్రికలు ప్రకటించాయి.

మొదటి దఫా శాసనసభ్యుడయిన రెండు వారాలకల్లా, చవట పాడులో ఉన్న సహకారసంఘ పాలకవర్గాన్ని జయప్రదంగా రద్దు చేయించాడు. అంజనేయులుగారి పెద్ద కొడుక్కు కమిటీ కాలేజీలో సీటు రాకుండా చేయించాడు. అంజనేయులుగారి వరికప్పలు తగల బడిపోయాయి. ఇదీ ఆయనే చేయించి ఉంటాడని జనం అను కొన్నారు. తెలితక్కువజనం ఎన్నయినా అనుకోవచ్చుగానీ – ఇందులో

ఏ వొక్కదాని వెనకైనా రాజరాజేశ్వరరావుగారి హస్తం ఉన్నదని రుజువుచేయడానికి ఎంతమాత్రం ఆధారంలేదు.

ఉన్న రెండెకరాల పొలాన్ని అలవ సులవ ధరలకు అమ్మేసుకొని ఆంజనేయులు గుంటూరు చేరుకొన్నాడు. చేరుకొన్న రెండు వారాలకు ఓ చిన్న పొగాకు కంపెనీలో మరీ చిన్న ఉద్యోగం సంపాదించాడు.

"ఉద్యోగమంటే ఏమిటో నాకు తెలీదుగానీ, నువ్వు చేస్తున్నది మాత్రం ఉద్యోగం కాదని నాకనిపిస్తున్నది. 'ఎందుకు?' అనినన్నడక్కు. నేను చెప్పలేను. మన పొలంలో కలుపు తీసిన వాడూ, అరక దున్నినవాడూ ఉద్యోగం చేసినట్టుకాదు, కూలిపని చేసినట్టు. ఆ పని చేసినన్ని రోజులకూ లెక్కచూసి కూలి డబ్బు లిచ్చేస్తాం. ఇక్కడా అంతే! ఆరు మాసాలపాటు నీచేత పని చేయించుకొని, ఆ 180 రోజులకూ రోజుకింత చొప్పున లెక్కచూసి, నిన్ను ఇంటికి పంపిస్తారు. దీన్ని 'ఉద్యోగ' మంటున్నాం. దాన్ని 'కూలిపని' అంటున్నాం. ఎందుకని?'' అన్నాడు భాస్కరం.

"నాకు తెలీదు. అయినా - ఇప్పుడప్పుడే నువ్విలాంటివన్నీ ఆలోచిస్తూ కూచోమాకు. ముందు నీ చదువు పూర్తిగానీ! ఆ తరవాత ఏదో వొక పద్ధతిలో కుదటపడు. ఆ తరవాత నువ్వేం ఆలోచించినా ఇబ్బంది ఉండదు. నువ్వు కాసిని మంచిపనులు చేదామన్నా, చేయడానికయినా నువ్వు బాగా ఉండాలి''అన్నాడు ఆంజనేయులు.

ఆయన తన జీవితానుభవం నించి ఈ మాటలు ఏరుకొచ్చి తన ముందు పరిచాడని భాస్కరం అనుకొన్నాడు. తండ్రి ధోరణితో భాస్కరం ఏకీభవించా డనడానికి లేదు. ఇదేమాట మరొకరెవరన్నా అంటే భాస్కరం కోడిపుంజులాగా ఆ మాటన్నవారి మీదికి దూకి ఉండేవాడే! అన్నది తండ్రి గనకా, ఆయన గారయినా ఈ మధ్యనే

ఇలాంటి ధోరణిలోకి వచ్చాడుగనకా, అలా రావడానికిగల కారణాలుకూడా తనకు తెలుసుగనకా భాస్కరం ఏమీ అనలేకపోయాడు.

మూడోసారి శాసనసభకు ఎన్నికలు ప్రకటించారు రాజరాజేశ్వరరావుగారు చపటపాడు నియోజకవర్గం అభ్యర్థిగా నామినేషన్ వేశాడు. ఆయనతోబాటు మరో పదకొండుమంది కూడా అదేరోజున నామినేషన్లు వేశారు. ఆ పదకొండుమందిలోనూ ముగ్గురు రాజరాజేశ్వరరావుగారి మనుషులేనని చాలామందికి తెలియదు. హరిజనులవోట్లూ, మహమ్మదీయుల వోట్లూ చీలిపోవడం కోసం ఆయన ఈ ఇద్దర్ని తన ఖర్చుతో నిలబెట్టాడు. మిగిలిన తొమ్మిదిమందీ ఓటర్లను పంచుకొంటారు. తనకు ఖచ్చితంగా ఓట్లుపడే గ్రామాలెన్నో ఆయన ముందుగానే లెక్కచూసుకొన్నాడు. కాగితాలమీద మంచి మెజారిటీ కనిపించింది. అయినా ఎందుకన్నా మంచిదని నియోజకవర్గాన్ని పునర్విభజన చేయించి, చాలా ముందుగానే జాగ్రత్తపడ్డాడు. అలా విభజించడం వల్ల గుంటూరు మునిసిపాలిటీ పరిధిలోకిరాని ఎన్నో ప్రాంతాలు ఇప్పుడీ కొత్త నియోజకవర్గంలోకి వచ్చి కలిశాయి. చాలా పొగాకు కంపెనీలు ఈ పరిధిలోకిరాని ప్రాంతాలలోనే ఉండడం కేవలం దైవికం!

ఎన్నికలు ఇంకో పదిహేను రోజులకు జరుగుతాయనగా ప్రచారం ఉధృతమయింది. ఆయన హితైషులు చాలా మంది ఆయనగారికి అనేక విధాలుగా సహాయంచేశారు.

ఈ సహాయం ఊరికేపోలేదు. ఆయన ఎవరూ ఊహించనంత మెజారిటీతో గెలిచాడు. ఫలితాలు ప్రకటించిన రోజున రాజరాజేశ్వరరావుగారిని పూలరథంమీద ఊరేగించారు.

"ఈసారి ఇంతేనా? ఇంకేమన్నా పైకి పోయేదున్నదా?" అన్నాడొకాయన.

ఆయనగారు తన కంపెనీ కార్లనే కాకుండా తన సొంత కారును కూడా ఎలక్షనప్పుడు రాజరాజేశ్వరరావుగారి కిచ్చాడు.

"మన చేతుల్లో ఏముంది బసవయ్యా ! అంతా భగవంతుడి దయ" అన్నారు రాజరాజరాజేశ్వరరావుగారు

"తమరన్నమాట నిజమేగానీ, ఈ రోజుల్లో ఆ భగవంతుడు కూడా సరాసరిగా కనిపించడం మానేశాడండి ! పార్టీ నాయకుల రూపంలోనే కనబడుతున్నాడు. మీరిక్కడఉంటే ఇక్కడే ఉంటారు. తరవాత తమ ఇష్టం" అన్నా రెవరో.

ఆ అన్నవారెవరయితేనేంగానీ ఆముక్క రాజరాజేశ్వరరావుగారికి నచ్చింది. ఆ మొన్నాడే ఆయన గుంటూరులో అదృశ్యమయ్యాడు. వారంరోజుల తరవాత ప్రకటించిన మంత్రివర్గ సభ్యుల పేర్ల పట్టికలో మన రాజరాజేశ్వరరావుగారి పేరు మూడోస్థానంలో ఉంది.

ఆ రాత్రికిరాత్రే ఓ అరడజను పడవకార్లు హైదరాబాదుకు బయలుదేరాయి. మిగిలిన వందకార్లూ కొత్త మంత్రిగారికి ఎల్లుండి చేయవలసిన సన్మాన సంరంభంలో మునిగిపోయాయి

సన్మానం బ్రహ్మాండంగా జరిగింది. చుట్టుపక్కల ఊళ్ళనించి జనం ఎడ్లబళ్ళమీద వచ్చారు. దండలువేసే కార్యక్రమమే ఒకగంటా 39 నిమిషాలసేపు పట్టింది. పదిమంది కవులు పంచరత్నాలూ, నవరత్నాలూ పద్యాల రూపంలో మంత్రిగారికి చదివించారు. తనకు జరిగిన సన్మానానికి రాజరాజేశ్వరరావుగారు 'ఉచితరీతి'ని సమాధానం చెబుతున్న సమాయానికి పావుతక్కువ పన్నెండు గంట అయింది.

మామూలు ఉద్యోగానికీ, పొగాకు కంపెనీలో ఉద్యోగానికీ చాలా తేడా ఉంది. మామూలు ఉద్యోగానికో స్కేలు ఉంటుంది.

ఇక్కడి ఉద్యోగాని కా టైం ఉండదు. మామూలు 'కూలీ'లయితే వేళకొస్తారు. వేళకు పోతారు. మేనేజిమెంటు సైడున ఉండే ఉద్యోగాలకు ఈ టైం ఉండదు. ప్రతిరోజూ పొద్దుపోయిందాకా కూచుని, ఆరోజు జరిగిన పనిని రివ్యూ చేసుకోవాలి. మర్నాటి పనిని నిర్ణయించుకోవాలి. అప్పుడు గాని ఇళ్ళకెళ్ళడానికి వీలుపడదు. అలా వీలుపడని కారణానే ఆంజనేయులు గారు రోజూ బాగా పొద్దుపోయాక నే ఇంటికొస్తుండేవారు

అలాంటిది -

ఆ రోజున వెళ్ళిన గంటకల్లా ఇంటి కొచ్చేశాడు. వస్తూనే మంచానికి అడ్డం పడ్డాడు 'ఇశ్శో' అంటూ.

"ఏమయింది నాన్నా ?" అన్నాడు భాస్కరం తండ్రికేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"ఉద్యోగం మానేశాను...మానేశానంటే నా అంతట నేను మానకోలేదు. వాళ్ళే మానేయమన్నారు" అన్నాడు ఆంజనేయులు.

భాస్కరం ఏమీ మాట్లాడ లేదు.

కనకమ్మగారు మంచినీళ్లు తీసుకొచ్చింది.

"కుర్రాడి కెక్కడన్నా ఇంత ఆధరువు దొరికిందాకానన్నా ఉంచమనలేక పోయారా?" అన్నది కనకమ్మ మంచంకోటిమీదున్న ఖాళీగ్లాసును అందుకొంటూ.

"ఇప్పుడు మనమున్న దుస్థితిలో ఆ కంపెనీవాళ్ళ కాళ్లమీద పడడానికయినా నా కభ్యంతరం లేనప్పుడు ఆ పిసరంత మాటా అనడానికి అభ్యంతర ముంటుందిటే ? నేనేం చేసినా ఆ ఉద్యోగం నిలవదని నాకు తెలుసు. అలాంటప్పుడు మాట ఖాళీచేసుకోవడ మెందుకని చక్కా వచ్చాను" అన్నాడాయన.

"అసలేం జరిగింది నాన్నా?'' అన్నాడు భాస్కరం. ఆగొడవను ఇంకా ఇంకా సాగదీయడం తండ్రికి ఇష్టముండదని తెలిసికూడా.

''జరిగిందేమిటో నాకు తెలుసుగానీ అది నేనుగానీ, నువ్వు గానీ, హరిబ్రహ్మాదులుగానీ రుజువు చేయలేరు. పాతకక్షను మనసులో ఉంచుకొని రాజరాజేశ్వరరావుగారే మనకీ ఉపకారం చేశారని తెలుసు. కానీ దీనికి రుజువు లేదు'' అన్నాడు ఆంజనేయులు.

కనకమ్మగారు లోపలి కెళ్ళిపోయింది.

భాస్కరం ముఖం గంభీరించింది.

''రాత్రింబగళ్లూ గొడ్డులాగా చాకిరీ చేశావన్న విశ్వాసం కూడా వాళ్ళకు లేకపోవడం ఆశ్చర్యంగా లేదా నాన్నా?'' అన్నాడు భాస్కరం.

ఆ స్థితిలో ఉండికూడా ఆంజనేయులు సన్నగా నవ్వాడు.

''నీకేమన్నా విడ్డూరంగా ఉందేమోగానీ నాకులేదు నాన్నా! ఎందుకంటే గొడ్డుచాకిరీ చేయడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళు దేశంలో ఏ మూలకెళ్ళినా పుష్కలంగా దొరుకుతారు. చాకిరీ చేయించుకొనే వాళ్ళే లేరు. ఈ కంపెనీ సంగతి చూడరాదా? ఐదేళ్ళకిందట రామ నరసయ్య మామూలు మనిషి! పొగాకు పండించి నష్టపోయాడు. ఆ పొగాకుతోనే వ్యాపారం చేసి లక్షలు గడించాడు. ఎంత మంది ఎన్నిరకాల గొడ్డుచాకిరీ చేయందే ఈకంపెనీ ఈ దశకొచ్చిందంటావ్? ఈ సంగతి పట్టించుకొనే నాథుడే లేడు. మిగిలినవాళ్ళందరికన్నా నిరుడు రామనరసయ్య - అదే రామనరసయ్యగారు, మంచి బిజినెస్ చేశాడు. ఈ ఏడు ఇంకా బాగా చేస్తాడని అన్ని కంపెనీలవాళ్ళూ గోలగా చెప్పుకొంటున్నారు. ఎందుకేమిట్రా నాయనా!

''మొన్న జరిగిన ఎలక్షన్‌లో రాజరాజేశ్వరరావుగారికి సగం దన్ను ఈ రామనరసయ్యగారే! స్వయంగా మన రామనరసయ్య గారికి రాజకీయాలతో సంబంధాలేమీ లేవు. కానీ ఈ రాజకీయ

అందరకూ ఆయన అంతో ఇంతో దగ్గరవాడే. ఇప్పుడు రాజరాజేశ్వర రావుగారికి మరీ దగ్గరయ్యాడు. లండన్ బిజినెస్‌లో సగానికి సగం రామనరసయ్యగారికి ఖాయమన్నది ఆయనగారే నాతో అన్నారు ఇప్పుడు రాజరాజేశ్వరరావుగారు ఏం చెబుతే అది రామనరసయ్య. గారు చేస్తారు. వీరికేం కావలసిందీ రాజరాజేశ్వరరావుగారూ చేస్తారు'' అన్నాడు ఆంజనేయులు.

తన తండ్రి ఎందుకు ఉద్యోగం మానుకొన్నదీ కాదు, ఎందు కని మానుకోవలసి వచ్చిందీ భాస్కరానికి తెలిసిపోయింది.

''ఈ ఉద్యోగం పోతేపోనీలే నాన్నా! ఈ వయసులో కూడా నువ్వింకా ఉళ్ళుపకానం చేసుకోవడం నాకేం నచ్చలేదు'' అన్నాడు భాస్కరం.

ఆంజనేయులు మెరిసే కళ్ళతో కొడుకును చూశాడు.

''యాభయ్యేడేళ్ళు పెద్ద వయస్సేమీకాదు నాన్నా! నాకింకా ఓపిక ఉంది. ఆరోగ్యం ఉంది. కంటికి మసక కూడా రాలేదు. ఇంకా మూడు నాలుగేళ్ళపాటు ఏదో విధంగా బండిని లాగుదామని ఉంది.''

ఇంకో మూడేళ్ళపాటా? అంటే అరవయ్యేళ్ళొచ్చిందాకా అన్నమాట! అప్పటికి తను డిగ్రీహోల్డరవుతాడు-మధ్యలో ఎక్కడా పామునోట పడకపోతే!

మూడేళ్ళు...సుమారుగా పదకొండు వందల రోజులు! ఈ జక్కుప్రాణి తమ పొట్టలు నింపడం కోసం తనను తాను కరిగించు కోవడం ఎంత ఘోరం!!

''నేనిక చదువు మానేస్తాను నాన్నా'' అన్నాడు భాస్కరం.

ఆంజనేయులు ఉలిక్కిపడ్డాడు

''ఈ చదువు పేరుతో ఇప్పటికే మనం చాలా పాడుపని చేశా మనుకొంటున్నాను. బియ్యేలు, ఎమ్మేలూ చదివి రోజుకూలీ లుగా పనిచేస్తున్నవాళ్ళను మనం చూస్తూ కూడా మనమింకా

జేవార్సు చదువులనెందుకు చదువుకొంటున్నామో చచ్చినా అర్థం కాదు. రోడ్లూడవడానికీ, బల్లలు తుడవడానికీ, బూట్లు పాలిష్ చేయడానికీ - చదువుకూ ఎక్కడా లంగరందడం లేదు. మూడేళ్ళ తరవాత కూడా నేను చేయవలసిన పనులు ఇవే అయినప్పుడు - ఆ పనులు ఇప్పణ్ణించే చేస్తేమట్టుకేం? నువ్వు కాస్తలో కాస్తనన్నా సుఖపడవచ్చుగదా!'' అన్నాడు భాస్కరం.

ఆంజనేయులు కట్టుపంచతో ముఖం తుడుచుకొన్నాడు. గొంతు సవరించుకొన్నాడు. చొక్కా గుండీలు విప్పాడు.

''నువ్వన్నది నిజమేననుకో!'' అన్నాడు ఆంజనేయులు. ''చాలా కాలంగా నాకో దిక్కుమాలిన కోరిక ఉందిరా! మన వంశంలో అటు మూడు తరాలు, ఇటు మూడుతరాలు తిరగేసినా చదువుకొన్నవాళ్ళెవ్వరూ లేరు. నాదేమో వానాకాలం చదువు. నిన్ననా గ్రాడ్యుయేటును చేద్దామనుకొన్నాను. నా బతుక్కు కనీసం ఆ కోరిక్కూడా తీరేట్టులేదు. సరే - సరే - ఏదో చేద్దాంలే! నువ్వు మాత్రం తొందరపడవాకు''

అలా అంటున్నప్పుడు ఆయన గొంతు పూడుకు పోయింది. అటుగా ముఖంతిప్పి కళ్ళు తుడుచుకొన్నాడాయన.

ఇది జరిగినరోజు రాత్రే, బాగా పొద్దు పోయాక తలుపు చప్పుడయితే ఆంజనేయులు వెళ్ళి తలుపుతీశాడు.

ఎదురుగా ఇద్దరు మనుషులు నిలబడి ఉన్నారు.

వారి నిదివరకెక్కడా చూసిన గుర్తు ఆంజనేయులుకు లేదు.

''మీరేనా ఆంజనేయులుగారంటే? అయితే క్షేమం సరయిన ఇంటికే వచ్చాం. మీరు రామనరసయ్యగారి కంపెనీలో పనిచేస్తున్నారటగదా! ఇవ్వాళ మిమ్మల్ని పనిలోంచి వెళ్ళమని ఆయనగారు చెప్పారా?'' అన్నాడొకతను.

''అవునండి!''

"అయితేసరే! అలా అన్నందుకు రామనరసయ్యగారు చాలా బాధపడుతున్నారిప్పుడు. చీకటితోనే ఆయనగారు బాపట్ల వెళుతున్నారుట. మీతో అర్జంటుగా మాట్లాడవలసిన సంగతులేవో ఉన్నాయిట. మమ్మల్ని తీసుకురమ్మని పంపించారు. ఫరవాలేదు. మేం కాస్సేపు ఇక్కడే ఉంటాం. మీరు సైకిలూ, గీకులూ తీసుకురాకండి. వారే కారు పంపించారు రండి వెడదాం!" అన్నాడతను.

వాకిట్లో కారున్నది. అది రామనరసయ్య గారిదే! ఆయన స్వంతానికి వాడుకొనే కారది.

"ఒసేవ్! తలుపేసుకో! నేను మళ్ళీ వస్తా" అని, పైపంచ భుజాన వేసుకొని తలుపులు దగ్గరగా లాగి వారితో కారెక్కాడు ఆంజనేయులు.

ఆ రాత్రివేళ అంత పొద్దుపోయాక కారెక్కి వెళ్ళిపోయిన ఆంజనేయులు ఆ మొన్నాడు మధ్యాహ్నం దాకా ఇంటికి రాలేదు.

భాస్కరం వెళ్ళి కంపెనీలో కనుక్కున్నాడు.

"నిన్న ఉదయమే ఆయన లెక్కచూసి పంపించానే" అన్నాడు రామనరసయ్య.

భాస్కరం గుండె గుభేలుమన్నది.

రాత్రి జరిగిందంతా చెప్పాడు.

"పిచ్చిపిచ్చిగా వాగమాకు! మీ నాన్న ఇంట్లోంచి పారిపోతే మమ్మేల్నేం చేయమంటావయ్యా బాబూ? పోయి వెదుక్కో.. లేదా పోలీసులకు రిపోర్టు చేసుకో" అని కారెక్కి వెళ్ళిపోయాడు రామనరసయ్య.

రామనరసయ్యగారు చెప్పిన రెండు పనులూ భాస్కరం చేశాడు...

మూడు మాసాల తరవాత – విశాఖపట్నం అడవుల్లో 'ఆత్మరక్షణ' కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆంజనేయులు మరణించాడని పత్రికలు ప్రకటించాయి.

"విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అనేక దోపిడీలకూ, హత్యలకూ కారకుడయిన ఆంజనేయుల్ని అదుపులోకి తీసుకొంటున్న సందర్భంగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆంజనేయులు మరణించాడు. అతని అనుచరులందరూ పారిపోయారు. చనిపోయే సమయాన సదరు ఆంజనేయులు దగ్గర మారణాయుధాలు, మందుగుండు సామగ్రి, నిషిద్ధసాహిత్యమూ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు."

ఇది—

ఒక సుప్రసిద్ధ దినపత్రిక తాలూకు ప్రత్యేక విలేఖరి బయట పెట్టిన కథనం.

* * *

"ఇవిచాలా? ఇంకా చెప్పనా ?" అన్నాను నిజంగారి వేపు చూస్తూ.

ఆయనగారూ కళ్ళింతచేసుకొని నన్నేచూస్తున్నారు!

"ఇలాంటి నిజాలు నాకు తెలుసు. ఓపిగ్గా వింటానంటే ఐదు వారాలపాటు ఏకధాటిన చెప్పగలను. ఇవన్నీనిజాలే గదా! ఇందులో ఏ నిజం గురించి నన్ను చెప్పమంటారు? నరసింహంగాడు ఎలాచచ్చిపోయిందీ, ఎందుకు చచ్చిపోయిందీ శశిభూషణరావుగారికి తెలీదా? తెలిసికూడా ఆయన మీ పక్షాన - అంటే నిజం పక్షాన వాదించలేకపోయాడు. ఉద్యోగం కోసం నచ్చిన 'గజ్జల గుర్రం' చావడానికి కారణం తెలుసు. అసలైన నిజం చెబితే శశిభూషణరావుగారి కూతురూ, అల్లుడూ అమెరికా వెళ్ళేవారేనా? విమ్మితల్లి సంగతే చూడండి. తను మొన్న మొన్నటి దాకా మోహన్‌బాబు కోసం అల్లాడిపోయాననీ, ఆయనతో స్వర్గసుఖాలు అనుభవించాననీ, అనంతంగారితో నిజం అన్నదనుకోండి. అతగాడు విమలను పెళ్ళాడేవాడేనా? నిజమేమిటో శశిభూషణరావుగారికి తెలుసు. విమ్మికి తెలుసు. రాజరాజేశ్వరరావుగారికీ తెలుసు. రామనరసయ్యకు తెలుసు. గోపాలానికి తెలుసు. విమ్మి అమ్మకూ, నాన్నకూ తెలుసు. మారు

వేషంతో వచ్చి ఆంజనేయుల్ని తీసుకెళ్ళిన పోలీసులకు తెలుసు. తెలిస్తేనే? ఆ నిజం బయట పెట్టేందుకు లేదు. పదిహేనేళ్ళమ్మాయి తనకంటే నాలుగురెట్లు వయస్సున్న వాడికి వొళ్ళప్పగించడం వెనక ఉండే నిజం; ఓ విద్యావంతుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడం వెనక ఉండే నిజం; ఓ చిన్న ఉద్యోగస్తురాలు తన పై అధికారిని చూసి పదేపదే నవ్వడం వెనక ఉండే నిజం; ఒక అభ్యర్థి ఎన్నికల్లో గెలవడం వెనక ఉండే నిజం; ఒకడి మీద అవిశ్వాస తీర్మానం వచ్చి అధికారం నుండి దిగిపోవడం వెనక ఉండే నిజం; ఒక కేసు కోర్టుల్లో ఓడిపోవడం వెనుక ఉండే నిజం; అలాంటిదే మరో కేసు గెలవడం వెనక ఉండే నిజం; ఒక రోగి దిక్కులేని చావు చావడం వెనుక ఉండే నిజం; అదే రోగం వచ్చిన మరొకడు, నయం చేసుకొని టింగురంగా మంటూ తిరగడం వెనక ఉండే నిజం; ఒక వ్యాపారవేత్త అధికారంలో ఉండే పార్టీకి భారీయెత్తున విరాళాలివ్వడం వెనక ఉండే నిజం; ఒక అగ్రదేశం మరో వర్ధమాన దేశానికి గ్రాంట్లు, సబ్సిడీలు, డొనేషన్లు, సాంకేతిక సహాయాలు, అప్పులు, పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకోవడం వెనక ఉండే నిజం... బాబుగారూ...మీకు నేను చెప్పదగినవాణ్ని కాదు - అతురాలా వేరు. పైకి చెప్పే నిజం వేరు. ఇప్పుడేదో కొత్తగా మునిగిపోయిందని మీరంటున్నారుగానీ, నిజానికి మీ కొంప ఎప్పుడూ మునిగే ఉన్నదని నా అనుమానం. అనుమానం కాదు - గట్టి నమ్మకమే! మిమ్మల్ని నమ్ముకున్నవాడెవడన్నా బాగుపడ్డాడేమో చెప్పండి? ఏసుక్రీస్తుకు శిలువ వేసిపారేశారు. గౌతమబుద్ధుడు రాజ్యాన్ని వొదిలేసి సన్యాసల్లో కలిసిపోయాడు. హరిశ్చంద్ర మహారాజు ఆఖరుకు పెళ్ళాం బిడ్డల్ని అమ్ముకోవలసివచ్చింది. బ్రూనో మంటల్లో కాలిపోయాడు. సోక్రటీస్ విషపానం చేశాడు ఇల్లాగా కట్టుకుపోయినన్ని దాఖలాలున్నాయి. నిన్ను నమ్ముకున్నవాడు సుఖపడిన దాఖలాలు మాత్రం ఎక్కడా లేవు. నిన్ను దూరం చేసుకొన్నకొద్దీ మేం సుఖపడతాం.

చిన్నెంతలోతుగా పాతిపెడితే, అంతకు ఐదురెట్లూ, పదిరెట్లూ ఎక్కువగా మేం పైపైకి ఎదుగుతాం. నిన్ను ముట్టుకొన్నవాడు మసయి పోతాడు...పోతాడు కాదు పోయాడు. ఇప్పుడు తమరు నా దగ్గర కొచ్చారు. నీ మాటలునమ్మి నిన్నుగురించి రాసేటంత అమాయకుణ్ణికాదు. ఇంకెవరన్నా ఆ పని చేస్తామంటే భేషుగ్గా వారి దగ్గర కెళ్ళండి. అలాంటివాడొకడున్నందుకు నేనూ సంతోషిస్తా. నాకు తెలిసినంతవరకూ, నా కనుచూపు ఆనినంత వరకూ, అలాంటి పిచ్చి వాళ్ళెవరూ నాక్కనిపించడం లేదు—చివరికి ఒక్క మాట చెబుతున్నా. పెద్దవాడివి. ఆరోగ్యం కూడా సరిగా ఉన్నట్టు కనిపించడం లేదు. ఏమిటంటే బాబుగారూ! ఇప్పుడేకాదు; ఇక ముందుకూడా మీరింతకన్నా బాగా బతగ్గలనని అనుకోకండి! నేనింకా పాతకాలం వాణ్ణి గనక మిమ్మల్ని పోల్చుకోనన్నా పోల్చుకోగలిగాను. నా తరవాత తరంవారికి ఆ శక్తి కూడా ఉండదు. ఎక్కడిదాకానో ఎందుకూ? మా పిల్లల్నే చూడరాదా? వాళ్ళు మిమ్మల్ని గుర్తుపట్టలేక పోయారుగదా! మీరు నిఖార్సయినవారే. మంచివారే! మీగురించి అనుకోడానికి తీరిగ్గా ఉన్నప్పుడు ఉబుసుపోకకు చర్చించుకోడానికి మీరో మంచి సబ్జెక్టుగా మాకు పనికొస్తారు. మీరులేనందుకు గమ్మత్తు గమ్మత్తుగా మేం విచారిస్తాం కూడా. ప్రస్తుతానికి ఇంతటితో తృప్తిపడండి రానున్న రోజులు ఇంతకన్నా అధ్వాన్నంగా ఉంటాయని మాత్రం నేను గ్యారంటీ ఇస్తా'' అన్నాను.

ఏ మనుకొన్నాడో ఏమో మరి - ఓసారి చూపులతో నన్ను ఆపాదమస్తకం తడివి, తలొంచుకుని వెళ్ళిపోయాడు పాపం!

ఆయన వెళ్ళిపోయిన చాలా సేపటికి, నిజంగారికి ఓ గుక్కెడు నీళ్ళయినా ఇవ్వలేకపోయానన్న నిజం నాకు గుర్తుకొచ్చింది!

ఏం లాభం?

—:○:—